# బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునా మాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## పాలస్తీనా-ఇజ్రాయెల్ వివాదం ముగిసేనా?

**ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత, క్లిష్టకాలంలో ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామని ప్రధాని మోదీ ట్విటర్ వేదికగా ప్రకటించారు. క్లిష్టకాలంలో ఉన్నది. ఉనికిని కోల్పోతున్న పాలస్తీనాదా? దాన్ని ఆక్రమించి పాలస్తీనీయులపై అమానవీయ హింసకు పాల్పడిన ఇజ్రాయెల్‌దా? 1517లో పాలస్తీనాను ఒట్టోమాన్ రాజ్యం స్వాధీనపర్చుకున్నది. 1917లో దాన్ని బ్రిటన్ జయించింది. పాలస్తీనాను ఆంగ్ల, అరబ్ భాషల్లో పాలస్తీనా అని, పక్కనే హిబ్రూ భాషలో ఎరెట్జ్ ఇజ్రాయెల్ అని రాసేవారు. 1917 నుంచి 1948 వరకు పాలస్తీనాలో బ్రిటిష్ వారి పాలన సాగింది. పాలస్తీనాలో అరబ్బులు, యూదులు, క్రైస్తవులు నివసించేవారు.**





మొదటి ప్రపంచయుద్ధంలో యూదుల మద్దతు కోసం వారికి ప్రత్యేక రాజ్యం ఇస్తామని తన విదేశాంగ కార్యదర్శి ఆర్థర్ జేమ్స్ బాల్ఫోర్ మద్దతుతో 'బాల్ఫోర్ ప్రకటన' ద్వారా బ్రిటన్ వాగ్దానం చేసింది. 1939-1945 మధ్య జర్మనీ నియంత హిట్లర్ ఆజ్ఞలతో నాజీలు 60 లక్షల మంది యూదులను చంపారు. వారిలో 15 లక్షల మంది పిల్లలున్నారు.19వ శతాబ్దం చివర మొదలైన యూదు జాతీయ వాదానికి నాజీ యూదు మారణకాండ తోడైంది. తమకు ప్రత్యేక దేశం కావాలన్న కోరిక యూదుల్లో బలపడింది.

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత బతికి బట్టకట్టిన ఐరోపా దేశాల యూదులు పాలస్తీనాకు వచ్చారు. 1947, ఏప్రిల్ 2న నాటి బ్రిటన్ కోరిక మేరకు ఐక్యరాజ్యసమితి (ఐరాస) సాధారణ సభ 1947, నవంబర్ 29న 181వ తీర్మానాన్ని ఆమోదించింది. బ్రిటన్ అధీన పాలస్తీనాను 1948, మే 14న యూదు (ఇజ్రాయెల్), అరబ్ (పాలస్తీనా) దేశాలుగా విభజించడం ఆ తీర్మాన సారాంశం. ఈ తీర్మానాన్ని అమెరికా, బ్రిటన్, సోవియెట్ యూనియన్‌లు సమర్థించాయి. అరబ్ దేశాలు తమ దేశాల్లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించాయి. అరబ్ దేశాల వ్యతిరేకతకు భయపడ్డ అమెరికా ఈ తీర్మానానికి తన మద్దతును ఉపసంహరించుకున్నది. ఈ విభజనతో రెండు మత దేశాలు స్థాపించబడ్డాయి. దీన్ని మన ప్రధాని నెహ్రూ వ్యతిరేకించారు. ఐరాసలో తీర్మానానికి భారత ప్రతినిధి విజయలక్ష్మి పండిత్ వ్యతిరేకంగా ఓటేశారు.

ఈ ఐరాస తీర్మానం యూదులకు మోదాన్ని, అరబ్బులకు ఖేదాన్ని కలిగించింది. అది అంతర్యుద్ధానికి దారితీసింది. యూదు ప్రజా మండలి నాయకుడు డేవిడ్ బెన్ గురియన్ 1948, మే14న ఇజ్రాయెల్ దేశ స్థాపనను ప్రకటించారు. విభజన తీర్మానానికి మద్దతు ఉపసంహరించుకున్న అమెరికా అధ్యక్షుడు హారి ఎస్. ట్రూమన్ అదే రోజు ఆ కొత్త దేశాన్ని గుర్తించారు. సోవియెట్ నాయకుడు స్టాలిన్ ఆ పనే చేశారు. అరబ్ దేశాలు ఈ విభజనను తిరస్కరించాయి. 1948 నుంచి 1967 వరకు పాలస్తీనా భాగాలైన వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసాలెం లను జోర్డాన్, గాజా స్ట్రిప్ (భూభాగం) ను ఈజిప్ట్ పాలించాయి. మూడేండ్లలో 6 లక్షల మంది ఐరోపా దేశాల యూదులు పాలస్తీనాకు వచ్చారు. ఐరాస నిర్ణయించిన దాని కంటే 20 శాతం ఎక్కువ భూ భాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. తర్వాతికాలంలో అత్యధిక పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఐరాస మధ్యవర్తిగా స్వీడిష్ దౌత్యవేత్త కౌంట్ ఫోల్కే బెర్నడొట్టె చేసిన శాంతి ప్రణాళికను ఇరు పక్షాలు ఆమోదించలేదు. 1948 సెప్టెంబర్‌లో లేహి తీవ్రవాదులు ఆయనను హత్యచేశారు. 1949 ఎన్నికల తర్వాత సనాతన యూదు మతవాద పార్టీల మద్దతుతో బెన్ గురియన్ తిరిగి ప్రధాని అయ్యారు. ఈ రోజుకు 135 ఐరాస సభ్య దేశాలు గుర్తించిన పాలస్తీనాను ఇజ్రాయెల్ గుర్తించలేదు. ఇజ్రాయెల్‌కు అతి దగ్గరి మిత్ర దేశాలలో ఐరాసను నియంత్రించే అమెరికా ప్రధానమైనది.

పాలస్తీనా-ఇజ్రాయెల్ సంఘర్షణకు రెండు-దేశాల పరిష్కారాన్ని వర్తింపజేయడమే ఏకైక మార్గం. అంటే యూదులకు ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజలకు పాలస్తీనా. ఇజ్రాయెల్ ప్రభుత్వం తరుపున ప్రధాని ఇట్జక్ రాబిన్, పాలస్తీనా విమోచన సంస్థ పక్షాన మహమ్మద్ అబ్బాస్, అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో 1993, సెప్టెంబర్13న ఓస్లో ఒప్పందంలో భాగంగా దీన్ని అంగీకరించి, సంతకాలు చేశారు. 1948-49 అరబ్-ఇజ్రాయెల్ యుద్ధంలో మధ్యప్రాచ్యంలో చిన్న భూభాగమైన పాలస్తీనాలో అనేకులు చనిపోయారు.చాలా కుటుంబాలు నాశనమయ్యాయి. పిల్లలు అనాథలయ్యారు, లేదా చంపబడ్డారు. ఈ హింసను ఆపడానికి అంతర్జాతీయ సమాజం నిజాయితీగా కృషిచేయాలి.

ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంపై చైనా వైఖరి ఇదేనని, మధ్యప్రాచ్య సమస్యపై చైనా ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జై జున్ ఈ నెల 10 న ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికి చెప్పారు. గాజా భూభాగంలో ఇజ్రాయెల్ దళాలు, హమాస్ మధ్య జరిగిన పోరులో ఇప్పటికే 2,100 మందికి పైగా ప్రాణాలను కోల్పోయారు. దీనిపై ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వ శాఖలోని పాలస్తీనా శాఖ సహాయ మంత్రి ఒసామా ఖేదర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ జై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు హానిచేసే చర్యలను చైనా వ్యతిరేకిస్తుందని, ఖండిస్తున్నదని, తక్షణం కాల్పుల విరమణకు పిలుపునిస్తోందని జై చెప్పారు. అంతర్జాతీయ సమాజం, ముఖ్యంగా ప్రధాన దేశాలు, ఇజ్రాయెల్, పాలస్తీనాలు శత్రుత్వాన్ని విరమించుకునేట్టు ఒప్పించాలి.

ఇజ్రాయెల్ ఏర్పాటు నుంచి నేటి వరకు పాలస్తీనా ఉనికినే గల్లంతు చేయటానికి ఇజ్రాయెల్ అనేక దుర్మార్గాలకు పాల్పడింది. ఈ హింసకు హెచ్చరిక ప్రయత్నంలో భాగంగా అక్టోబర్ 7న హమాస్ దక్షిణ, మధ్య ఇజ్రాయెల్ భూభాగాలపై దాడికి పాల్పడింది. వందలాది ఇజ్రాయెల్ పౌరులను చంపింది. 'ఇజ్రాయెల్ మిగిలిన మా భూభాగాలనూ ఆక్రమిస్తోంది. మా ప్రజలను చంపుతోంది. మమ్ములను రెచ్చగొడుతోంది. అందుకే ఈ దాడి చేశాం' అని హమాస్ తమ దాడిని సమర్థించుకుంది. గాజాపై తన భారీ హింసాత్మక దాడులు, హమాస్ దాడికి ప్రతీకారమని ఇజ్రాయెల్ సమర్థించుకోవచ్చు. కానీ అది ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య విభేదాలను మరింత తీవ్రతరం చేస్తుంది.

**ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య దాడి, ఎదురు దాడుల కారణంగా, రెండువైపులా ప్రజలు నిరంతరం భయంతో బతుకుతున్నారు. 75 ఏండ్ల హింస తర్వాత శాంతిని ఆశించలేరు. ఇజ్రాయెల్ ప్రజలను చంపడం, లేదా క్షిపణులను ప్రయోగించటం వల్ల వారికి శాంతిభద్రత లుండవని పాలస్తీనా తీవ్రవాదులు, ముఖ్యంగా హమాస్ గ్రహించాలి.**

ఇజ్రాయెల్ సైన్యం ఎంత బలంగా ఉన్నా, అది స్వల్ప ఘటనలను, కారణాలను రెచ్చగొట్టే చర్యలుగా భావించరాదు. వెస్ట్ బ్యాంక్, గాజాలలోని పాలస్తీనా భూభాగాలపై క్షిపణులతో దాడిచేయడం, మరింత పాలస్తీనా భూమిని ఆక్రమించడం మానుకోవాలి. రెండు-దేశాల మధ్య సమస్య పరిష్కారానికి అంతర్జాతీయ సమాజం కృషి చేయాలి. ఇజ్రాయెల్ వైపు నిలుస్తున్న మన పాలకులు ప్రపంచ పటంలో స్థానం కోల్పోతున్న పాలస్తీనాకు అండగా నిలబడాలి. దాన్ని మింగిన ఇజ్రాయెల్ కొమ్ము కాయరాదు.

**'ఇజ్రాయెల్ మిగిలిన మా భూభాగాలనూ ఆక్రమిస్తోంది. మా ప్రజలను చంపుతోంది. మమ్ములను రెచ్చగొడుతోంది. అందుకే ఈ దాడి చేశాం' అని హమాస్ తమ దాడిని సమర్థించుకుంది. గాజాపై తన భారీ హింసాత్మక దాడులు, హమాస్ దాడికి ప్రతీకారమని ఇజ్రాయెల్ సమర్థించుకోవచ్చు. కానీ అది ఇజ్రాయెల్ -పాలస్తీనా మధ్య విభేదాలను మరింత తీవ్రతరం చేస్తుంది.**



**సంగిరెడ్డి హనుమంత రెడ్డి**
94902 04545
(వ్యాసకర్త: ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి )

## బీజేపీ గుణపాఠం నేర్చేనా?

**మొన్న జరిగిన 'లద్దాక్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సెల్ ' ఎన్నికల్లో బీజేపీ చిత్తుగా ఓడిపోయింది. నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. మొత్తం 30 స్థానాల్లో 4 నామినేటెడ్ స్థానాలు పోగా మిగిలిన 26 సీట్లలో బీజేపీ 2 స్థానాలకే పరిమితమైంది. 22 స్థానాలను నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి గెలుచుకున్నది. ఇది రానున్న ఎన్నికలకు శుభసూచకం కానున్నదని విపక్షాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ ప్రాంతంలో బీజేపీకి ఒక ఎంపీ ఉన్నా ఎన్నికలపై ఏ మాత్రం ప్రభావం చూపించలేకపోవడం గమనార్హం.**



బీజేపీ ప్రభుత్వం 2019లో జమ్ముకశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసింది. బీజేపీ పార్లమెంటులో తనకున్న తిరుగులేని మెజారిటీతో ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ఆ రాష్ర్టాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడదీసింది. ఇది జరిగి నాలుగేండ్లు గడిచినా బీజేపీ స్థానిక ప్రజల్లో విశ్వాసాన్ని పొందలేకపోయింది. ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే స్థానికులకు బీజేపీపై ఇంకా ఆగ్రహం చల్లారలేదని స్పష్టంగా అర్థమవుతుంది.

కేంద్రపాలిత ప్రాంతంగా మారితే లద్ధాఖ్ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఎన్నికల్లో బీజేపీ విస్తృతంగా ప్రచారం కూడా చేసింది. కానీ స్థానిక ప్రజలు ఆర్టికల్ 370 రద్దు చేయటంతో తమకు న్యాయబద్ధంగా దక్కాల్సిన సహజ వనరులు, ఉద్యోగాల మీద తమ హక్కులను అయిష్టంగా, బలవంతంగా వదులుకోవాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ఇదే విషయాన్ని నేషనల్ కాన్ఫరెన్స్- కాంగ్రెస్ కూటమి విస్తృతంగా ప్రచారం చేసింది. ప్రజలు ఈ వాదానికే ఎక్కువ విలువనిచ్చినట్టు ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

బీజేపీ ఈ ఎన్నికల్లో గెలుపు కోసం అనేకమంది కేంద్ర మంత్రులను ప్రచారంలోకి దించింది. అనేక వాగ్దానాలను చేసింది. కనీసం10 స్థానాలైనా దక్కకపోతాయా?అని అంచనా వేసింది. కానీ ఈ ఫలితాలు బీజేపీని తీవ్ర నిరాశకు గురిచేశాయి. ఒకవేళ ఈ ఎన్నికల్లో బీజేపీ గెలిచి ఉంటే ముస్లిం మెజారిటీ ఉన్న కార్గిల్ ప్రాంతంలోకి బీజేపీ చొచ్చుకొని వచ్చి విజయం సాధించిన ఘనత దక్కించుకొనేది. ముస్లింలతో పాటు బౌద్ధులు అధికంగా ఉన్న ఇతర జిల్లాలతో కూడిన లద్ధాఖ్‌లో ఈ ఓటమి బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బే. బీజేపీ పరాజయం భవిష్యత్తు ఎన్నికలకు పునాదులు పడ్డట్టేనని విమర్శకులు భావిస్తున్నారు.

ఈ ఎన్నికల కోసం దేశంలో వివిధ ప్రాంతాలలో బతుకడానికి వలసపోయిన స్థానికులు సైతం తిరిగివచ్చి తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు.తమ అభీష్టాన్ని ఓట్ల ద్వారా స్పష్టంగా వ్యక్తం చేశారు. 78 శాతం ఓటింగ్ నమోదు కావడమంటే స్థానికులు ఈ ఎన్నికలను ఎంత సవాల్‌గా తీసుకున్నారో అర్థమవుతున్నది. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఇక్కడి బౌద్ధులు, ముస్లింలు, 'షియా' మతస్థులు,'సున్ని' మతస్థులు ఎటువంటి జాతి విభేదాలు లేకుండా ఐక్యంగా తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇక్కడి ప్రజలు ఉమ్మడిగా బలంగా ఒక్కటే కోరుతున్నారు. ఇక్కడి భూములు స్థానికులకు మాత్రమే దక్కాలి. అలాగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానికులకే దక్కాలి. తమదైన విలక్షణ సంస్కృతిని, పర్యావరణాన్ని పరిరక్షించాలి.అందుకు అవసరమైన రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చెప్పినట్టుగా తమకు ప్రత్యేక ప్రతిపత్తినివ్వాలని గత నాలుగేండ్లుగా బౌద్ధులు, ముస్లింలు కలిసి ఇక్కడ ఐక్యంగా ఉద్యమాలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం వారి ఆకాంక్షలను పట్టించుకోవటం లేదు. తమను తిరిగి జమ్ముకశ్మీర్‌లో కలపాలని, లద్ధాఖ్‌కు పూర్తిస్థాయిలో రాష్ట్ర హోదా కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**బీజేపీ చెప్పిన రోడ్డు విస్తరణ కార్యక్రమాలు, విద్యా సంస్థల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర సాధారణ చర్యలు ఈ ప్రాంత ప్రజల ఆత్మాభిమానం, ప్రాంతీయాభిమానం, స్వేచ్ఛా ప్రియత్వం ముందు వెలవెలబోయాయి. స్థానిక అవసరాలు, ఆకాంక్షలతో పాటు అనేక ఇతర అంశాలు ఎన్నికల ముందు ఓటర్ల ప్రవర్తనా రీతులపై విభిన్నంగా పని చేసి ఉండవచ్చు. బీజేపీ ఏలుబడిలో గత నాలుగేండ్లలో శాంతిభద్రతల పరిస్థితుల్లో పెద్దగా మార్పులు రాలేదని స్థానికులు అంటున్నారు.**

ఇటీవల జమ్ము కశ్మీర్‌లో చోటు చేసుకున్న అతిపెద్ద ఉగ్రవాద చర్యలతో సహా అన్ని సంఘటనలు శాంతి భద్రతలు సజావుగా లేవని స్పష్టంగా చెప్తున్నాయి. ఈ ప్రాంతంలో ఉగ్రవాదుల చొరబాట్లు కూడా పూర్తిగా ఆగలేదు. ఇంటర్‌నెట్‌ను నెలల తరబడి నిలిపివేయటం. సైనికుల భారీ బందోబస్తుతో అడుగడుగునా కంచెల నిర్మాణాలతో, పాక్షిక, దీర్ఘకాల కర్ఫ్యూలతో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు సజావుగా ఉన్నాయని చెప్పలేం. దేశ, విదేశీ జర్నలిస్టులపై అనేక ఆంక్షలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. సాధారణ పరిస్థితుల్లో స్థానిక ప్రజలు నిర్భయంగా స్వేచ్ఛగా సంచరించగలిగే వాతావరణం,అవకాశాలు ఉన్నప్పుడు మాత్రమే శాంతి నెలకొన్నట్లుగా భావించాలి.

గత ఐదేండ్లుగా కేంద్ర పాలనలో ఉన్న జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించటం లేదు. ఈ అంశంలో ఎప్పుడు ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్ణయం తీసుకుంటారో తెలియదు. ఇప్పటికే డీలిమిటేషన్ ప్రక్రియ ముగిసింది. రెండుసార్లు ఓటర్ల జాబితాలు సవరణలు చేశారు. అయినా కూడా అసెంబ్లీని పునరుద్ధరించే విషయంలో కేంద్రం ఎందుకు జాప్యం చేస్తున్నదో అర్థం కావడం లేదు. కేంద్రం సుప్రీంకోర్టులో సైతం ఎన్నికల నిర్వహణకు హామీ ఇచ్చింది. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదం నశించిపోయిందని ప్రభుత్వమే నిక్కచ్చిగా అం టుంది. అలాంటప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్ పాలనను ప్రజలు ఇంకెంతకాలం భరించాలి? స్థానిక ప్రజల అభీష్టం మేరకు సకాలంలో ఎన్నికలు నిర్వహించి జమ్ము కశ్మీర్‌లో శాంతిభద్రతలను నెలకొల్పడానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతుందని ఆశిద్దాం.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
98493 28496



## ధమ్మచక్ర పరివర్తన దినం

**భారతదేశంలో పుట్టిన బౌద్ధమతం ఆ తర్వాత చైనా, జపాన్, థాయిలాండ్, శ్రీలంక, భూటాన్, సింగపూర్ మొదలైన దేశాల్లో విస్తరించింది. సమాజంలో మానవులందరూ సమానమేనని, కులాలకు తావులేకుండా అందరూ ఒక్కటేననే భావన కలిగించడంతో బౌద్ధం అందరినీ ఆకట్టుకున్నది.**

బౌద్ధమతం మానవులందరినీ సమానత్వ దృక్కోణం నుంచి చూసింది. కుల, మతాలకు అతీతంగా సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవించాలని ప్రజలను నిర్దేశించింది. బౌద్ధమతం ఒక మేధో తాత్విక మతం. దీనిలో ఆత్మ, దేవుడు, మరణానంతర జీవితం, మూఢనమ్మకాలు, సంప్రదాయం వంటి విషయాలపై ప్రత్యేక చర్చ లేదు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక తత్వశాస్త్రం గౌతమ బుద్ధుని నుంచి ప్రేరణ పొందినదే.

నాడు బౌద్ధమతం రెండు శాఖలు ప్రబలంగా ఉండేవి. అవి మహాయాన, హీనయానం. హీనయాన శాఖ దేవుని ఉనికిని తిరస్కరించింది. బుద్ధుడిని మార్గాన్ని చూపే వ్యక్తిగా పరిగణించింది. కానీ మహాయానులు బుద్ధుడిని దేవుడిగా కాకుండా శక్తి రూపంగా భావించి పూజించారు.


క్రమంగా విదేశీయుల దండయాత్రలు, మతపరమైన మార్పుల కారణంగా బౌద్ధమతం భారతదేశంలో ఉనికి కోల్పోతూ వచ్చింది. కొంతమంది భారతీయులు బౌద్ధమతాన్ని పూర్తిగా విదేశీ మతంగా భావించడం మొదలుపెట్టారు. కానీ 20వ శతాబ్దంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ హిందూ మతాన్ని విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నారు.1935లో యోలా మైదాన్‌లో జరిగిన ఒక సమావేశంలో మాట్లాడుతూ 'నేను హిందూ మతంలో పుట్టాను. అది నా నియంత్రణలో లేదు. కానీ నేను హిందూ మతంలో చావను. అది పూర్తిగా నా నియంత్రణలోనే ఉంది' అన్నారు. ఆ రోజు నుంచి అంబేద్కర్ దాదాపు 21ఏండ్లపాటు అన్ని మతాలను అధ్యయనం చేసిన తరువాత బుద్ధుని సూత్రాలే ఆచరణాత్మకమైనవని భావించారు.ప్రపంచంలో సమాజాన్ని మనిషిగా చూడగలిగే ఏకైక మతం బౌద్ధం అని తెలుసుకున్నానన్నారు.

**డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిన్నప్పటి నుంచి కబీర్ అనుచరుడు. అందువల్ల బుద్ధుడిని అర్థం చేసుకోవడం అతనికి కష్టం అనిపించలేదు. అంబేద్కర్ తన కమ్యూనిటీకి చెందిన లక్షలాది మంది ప్రజలు, ఇతరులతో కలిసి మహారాష్ట్ర లోని నాగపూర్‌లో 1956 అక్టోబర్14న విజయదశమి రోజున బౌద్ధమతంలోకి మారారు. నాటి నుంచి ఆ రోజును దేశమంతటా 'ధమ్మ చక్ర పరివర్తన దినం'గా జరుపుకుంటున్నారు.**

ఎందుకంటే ఈ రోజునే గౌతమ బుద్ధుడు బౌద్ధ సూత్రాలను ఆవిష్కరించారు. అలాగే తన ఐదుగురు శిష్యులకు మొదటి మతపరమైన దీక్షను ఇచ్చారు. ఇదే రోజున అశోక చక్రవర్తి యుద్ధరంగంలోనే బౌద్ధ మతం స్వీకరించాడు. అందుకే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆ రోజునే బౌద్ధ మతం స్వీకరించాలని నిర్ణయించుకున్నారు. విజయదశమి పర్వ దినం రోజున ఆయన బౌద్ధం స్వీకరించారు. నాటి నుంచి ఆ రోజును 'ధమ్మచక్ర పరివర్తన దినం'గా పిలుస్తున్నారు. బుద్ధుని మార్గం ద్వారానే ప్రపంచంలో శాంతి, సామరస్యాలు నెలకొంటాయని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విశ్వసించారు. అందుకే ఆయన బౌద్ధమతాన్ని స్వీకరించడానికి ఆసక్తి చూపారు.



**మధునూరే రాహుల్**
63053 97692




## ఇంటింటికీ కేసీఆర్ ధీమా

**ప్రజా సంక్షేమానికి కట్టుబడి చేసిన మంచి పనులే నాయకులను అందలం ఎక్కిస్తాయి. రాజకీయాల జోలికి పోకుండా అందరికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించిన రాజనీతిజ్ఞులకే చరిత్ర బ్రహ్మరథం పడుతుంది. అలాంటి ప్రభుత్వాలే భవితకు దారి దీపాలవుతాయి. జాతికి ఆదర్శ పాఠాలుగా మిగులుతాయి. దేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణకు అలాంటి నికార్సయిన దార్శనికత, నిబద్ధత కలిగిన నాయకత్వం ఉండటం వల్లే రాష్ట్ర ప్రగతి సాధ్యమైంది. అటువంటి నాయకత్వానికే ప్రజలు తమ విశ్వాసాన్ని ప్రకటిస్తారని అనేక సందర్భాల్లో రుజువైంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో మరోసారి అధికార పార్టీకే ప్రజలు పట్టం కట్టనున్నారని స్పష్టమైంది.**

బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టో పూర్తిగా సంక్షేమ పథకాలతో నిండి ప్రజలకు వరాల జల్లు కురిపించింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 6 గ్యారెంటీలకు దీటుగా ఈ మ్యానిఫెస్టోను తీర్చిదిద్ది ప్రజల ముంగిట పెట్టినట్టు స్పష్టమవుతున్నది.

నేటి రాజకీయాల్లో ఎన్నికల ప్రణాళికలనేవి కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. అనేక రాష్ర్టాల్లో ఎన్నికల ప్రణాళికలను ప్రజలు, ఓటర్లు ఏమాత్రం సీరియస్‌గా ఆలోచించని నేపథ్యంలో తెలంగాణలో మాత్రం ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీలు విడుదల చేస్తున్న మ్యానిఫెస్టోలపై ప్రజలు విస్తృతంగా చర్చిస్తున్నారు. ఆయా మ్యానిఫెస్టోలను పూర్తిగా ఆకళింపు చేసుకొని తులనాత్మక అధ్యయనం చేస్తున్నారు. ఈ విషయంలో మన విద్యావంతులు, మేధావులు, బుద్ధిజీవులు ముందుంటారనే విషయంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

మ్యానిఫెస్టోలతో ఓటర్లు మారుతారా? ఓట్లు పడతాయా? అన్న ప్రశ్నకు స్పష్టమైన సమాధానం చెప్పలేము. కానీ తెలంగాణలో మ్యానిఫెస్టోలను చదివి వాటి సాధ్యాసాధ్యాలను పరిశీలించి, విశ్లేషించి, వివరించగల విషయ పరిజ్ఞానం తెలంగాణ ప్రజలకు ఉందనేది విస్మరించలేని అంశం.అందుకే టీఆర్‌ఎస్ పార్టీ 2014 మ్యానిఫెస్టోకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. అనేక మా మ్యానిఫెస్టోనే మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్ అని సందర్భాల్లో స్పష్టం చేసింది. 2018 ఎన్నికల మ్యానిఫెస్టో, 2019 పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టో, 2021 జీహెచ్‌ఎంసీ ఎన్నికల మ్యానిఫెస్టోలను కూడా బీఆర్‌ఎస్ ప్రధాన ప్రచార అస్త్రంగా నిలబెట్టింది.

**ఎన్నికల మ్యానిఫెస్టో కూర్పులో కేసీఆర్ తీసుకునే జాగ్రత్త, దాన్ని ప్రచారంలోకి తీసుకురావడంలో చూపించే ఆయన చతురత, అందులోని అంశాలను పార్టీ కార్యకర్తలకు, తద్వారా ప్రజలకు చేరవేసే నైపుణ్యత తెలంగాణలో మిగతా ఏ పార్టీలకు లేకపోవడం గులాబీ పార్టీకి కలిసి వచ్చే అంశం.**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సెప్టెంబర్ 17న సోనియా, రాహుల్ గాంధీ సమక్షంలో విడుదల చేసిన ఆరు గ్యారెంటీల ప్రకటనకు దీటుగా బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోను తీర్చిదిద్దారని నిస్సంకోచంగా చెప్పవచ్చు. గత తొమ్మిదిన్నరేండ్ల నుంచి కేసీఆర్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి ఎన్ని విమర్శలు వస్తున్నా వాటి అమలు విషయంలో చూపిస్తున్న శ్రద్ధ పలువురి ప్రశంసలు పొందింది. దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను విస్మయానికి గురిచేస్తుంది. రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ లాంటి అనేక పథకాలను వివిధ రాష్ర్టాలు అధ్యయనం చేసి ఆచరింపజేసే పరిస్థితికి రావడం మనం గమనిస్తూనే ఉన్నాం. ఇప్పటి వరకు అమలు చేస్తున్న పథకాలన్నింటిని మరింతగా విస్తరించి కొనసాగిస్తామని ప్రకటిస్తూనే ప్రజల ఆదరణ ఉన్న ఆ పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేయడానికి కార్యాచరణను రూపొందించి, కొత్త ప్రజాకర్షక పథకాలను బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రకటించింది .

**తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ 'కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా' అన్న పథకం రేపు ఇతర పార్టీలను ఆకర్షించక తప్పదు. ఎల్ఐసీ ద్వారా చేసే ఈ గ్రూప్ ఇన్సూరెన్స్ కచ్చితంగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించక తప్పనిపరిస్థితి. ఇది ఈ మ్యానిఫెస్టోకు హైలైట్‌గా నిలువబోతున్నది. ఈ ఒక్క పథకమే రేపు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారి ప్రజలను మరోసారి కారు గుర్తు పై ఓటు వేసే విధంగా మార్చబోతుంది.**

అదేవిధంగా రేషన్ కార్డు ఉన్నవారందరికీ సన్నబియ్యం, రూ.16 వేల వరకు రైతుబంధు పెంపు, పింఛన్లు రూ.5 వేలకు పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అర్హులైన మహిళలకు రూ.3వేలు, ఇంటి స్థలం లేని పేదలకు ఇండ్ల స్థలాల కేటాయింపు, అర్హులైన పేద మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ సహాయం రూ.15 లక్షల వరకు పెంపు, మైనారిటీ సంక్షేమ బడ్జెట్ పెంపు, గిరిజనేతరులకు పోడు భూములు, అర్హులైన జర్నలిస్టులకు రూ.400లకే సిలిండర్, అగ్రవర్ణ పేదలకు స్కూల్స్, మహిళా స్వశక్తి గ్రూపులకు సొంత భవనాలు వంటి పథకాలు కాంగ్రెస్, బీజేపీ హామీలకు దీటుగా నిలుస్తాయి.

ఉద్యమం కానీ, పాలన కానీ మాట ఇస్తే మడమతిప్పని నేతగా కేసీఆర్ అందరి మన్ననలు అందుకున్నారు. మ్యానిఫెస్టోల్లో ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది. ఈసారి ఎన్నికల్లోనూ ఆయన ప్రకటించిన మ్యానిఫెస్టోను నూటికి నూరుశాతం అమలు చేస్తారన్న విశ్వాసం ప్రజల్లో ఉన్నది. కేసీఆర్ ప్రకటించిన ఈ మ్యానిఫెస్టో కచ్చితంగా ప్రజాదరణకు నోచుకొని ఈసారి 'మళ్లీ సారే..గెలిచేదికారే' అన్న నినాదం నిజం కాబోతున్నది.



**కాలేరు రూపజ్యోతి**
92902 33450